సాక్షి
అనకాపల్లి
గురువారం । 28 । నవంబర్ । 2024



ఆయుర్వేదంపై అవగాహన

మధురవాడ: ప్రకృతి పరిరక్షణ్ అభియాన్‌లో భాగంగా 'ఆయుష్' రీజనల్ డీడీ ఝాన్సీ లక్ష్మీ బాయి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



శ్రావ్యంగా గాత్ర కచేరీ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ సంగీతోత్సవంలో భాగంగా చెన్నైకి చెందిన మణిమారన్ గాత్ర సంగీత కచేరీ శ్రావ్యానందకరంగా సాగింది.



ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: విశాఖ దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు బుధవారం స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పరవాడ, అచ్యుతాపురం సెజ్ పరిధిలో వరుస ప్రమాదాలు, పెద్ద సంఖ్యలో మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఫార్మా కంపెనీలంటేనే కార్మికుల కుటుంబాలు భయంతో వణికిపోతున్నాయి. ఐదున్నర నెలల వ్యవధిలో వివిధ ప్రమాదాల్లో 27 మంది కార్మికులు మృతి చెందారు. 80 మందికి పైగా అస్వస్థతకు లోనయ్యారు. పరిశ్రమల్లో మరణ మృదంగంపై కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంపై కార్మిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆగస్టు నెలలో అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా కంపెనీలో, పరవాడ సెజ్‌లోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ యూనిట్-3లో జరిగిన ప్రమాదాల్లో భారీ ప్రాణనష్టం సంభవించింది. ఆ పీడ కలలను మరువక ముందే పరవాడలోని ఠాగూర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో విషవాయువులు (హెచ్‌సీఎల్) లీకై ఒడిశాకు చెందిన అభిజిత్ దాస్ అనే కార్మికుడు మృతి చెందారు. మరో 8 మంది అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

గాల్లో ప్రాణాలు

ఎవరికీ పట్టని భద్రత ప్రమాణాలు

పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు



ప్రమాదం జరిగిన రోజున ఎసైన్షియా ఫార్మా కంపెనీలో కలకలం (ఫైల్)

27 మంది కార్మికులు మృతి | ఐదున్నర నెలల వ్యవధిలో | **80** మందికి పైగా అస్వస్థత

సాక్షి, అనకాపల్లి: ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కూటమి ప్రభుత్వం హైపవర్ కమిటీల పేరుతో హడావుడి చేస్తుంది. కంపెనీల్లోని లోపాలపై నిరంతరం తనిఖీలు చేయడంలేదు. ఇన్ని ప్రమాదాలు సంభవిస్తున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, పరిశ్రమల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్ ఆధ్వర్యంలో సేఫ్టీ అండ్ ఆడిట్ సమావేశం నిర్వహించినా వరుస ప్రమాదాలు జరుగుతున్నాయంటే రాష్ట్ర ప్రభుత్వం, పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ప్రమాదాలకు కారణమైన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. విచారణ కమిటీలు ఇచ్చిన నివేదికలు బహిర్గతం చేసి కంపెనీ యాజమాన్యాలపై చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటి ప్రమాదాలు మళ్లీ సంభవించేవికాదు.

రక్షణ లేని కార్మిక జీవితాలు

ఫార్మా పరిశ్రమల్లో విధులకు వెళ్లిన కార్మికులు క్షేమంగా ఇళ్లకు తిరిగి వస్తారన్న ధీమా ఉండడం లేదు. వారు ఇంటికి చేరే వరకు కుటుంబ సభ్యులు టెన్షన్‌తో ఎదురుచూసే దుస్థితి ఏర్పడింది. పరవాడ- అచ్యుతాపురం-రాంబిల్లి సెజ్ పరిధిలో పలు రసాయన పరిశ్రమల్లో కనీస రక్షణ చర్యలు కూడా లేకపోవడం, సేఫ్టీ మెజర్స్ పాటించకపోవడం, పరిశ్రమలో శిక్షణ గల ఫైర్ సిబ్బంది లేకపోవడంతోనే అధిక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ప్రమాదాలకు అధిక కారణంగా నిలిచే రియాక్టర్లు బాంబుల్లా పేలుతున్నాయి. ఇక్కడ కనీస అవగాహన లేని టెంపరరీ, కాంట్రాక్ట్ కార్మికుల చేత పనులు చేయిస్తున్నారు. వారు రియాక్టర్ల ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించకపోవడం, కెమికల్ రియాక్షన్‌ను నివారించడంలో విఫలం కావడంతో పేలుళ్లు జరుగుతున్నాయి. ఇక ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమ వర్గాలు చికిత్స కోసం క్షతగాత్రులను తరలించకపోవడంతో పాటు కొన్నిసార్లు వారు ఏమయ్యారో కూడా తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికంగా విధులు నిర్వహించే వారిలో అధికంగా స్థానికేతరులే ఉండడంతో వారి తరఫున పరిశ్రమలపై పోరాటం చేసే వారు లేక కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా పరిశ్రమల్లో కూడా స్థానికుల కంటే స్థానికేతరులనే ఎక్కువగా తీసుకోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రశ్నించే వారే లేకుండా పోతున్నారు. చాలా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన వెంటనే చికిత్స కోసం తరలించేందుకు సరైన అంబులెన్స్ లాంటి వాహన సౌకర్యాలు, వారి పరిశ్రమల్లోనే వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగి అక్కడ నుంచి నగరానికి చేరేలోపు కార్మికులు మృత్యువాత పడుతున్నారు.

ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం

పరిశ్రమల్లో రక్షణ చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో కార్మికుల రక్షణ, భద్రత ప్రమాణాలు, నిత్యం తనిఖీలు వంటివి వట్టి మాటలుగానే మిగిలాయి. కేవలం ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేసే అధికారులు, నాయకులు అనంతరం ఇటువైపు చూడడం లేదు. నెలకు కనీసం రెండు ప్రమాదాలు జరుగుతున్నా నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. పరవాడ జేఎన్ ఫార్మా సిటీలో గల ఠాగూర్ కంపెనీలో మంగళవారం కంపెనీ ఉత్పత్తి కర్మాగారంలో రియాక్టర్-కమ్-రిసీవర్ ట్యాంక్ (జీఎల్ఆర్-325) నుంచి 400 లీటర్ల హెచ్‌సీఎల్ లిక్విడ్ లీక్ అయింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు జరగగా.. మర్నాడు ఉదయం 6 గంటల తరువాత అధికారులు, యాజమాన్య ప్రతినిధులు స్పందించారు. ఘటన జరిగి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి వుంటే తమ సహచరులు మరణించి ఉండేవాడు కాదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. జిల్లా ఉన్నత అధికారులు కంపెనీ యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ..కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా అంటూ కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి.

భద్రత డొల్ల...తనిఖీలు కల్ల!

- కార్మికుల రక్షణ విషయంలో ప్రభుత్వం, యాజమాన్యాల అలసత్వం
- ప్రమాదం జరిగినప్పుడే హైపవర్ కమిటీ అంటూ హడావుడి
- పరవాడ, అచ్యుతాపురం సెజ్‌లో వరుస ప్రమాదాలు
- ఎసైన్షియా ఫార్మా ప్రమాదం మరువక ముందే ఠాగూర్ కంపెనీలో విషవాయువు లీక్



శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహం (ఫైల్)

గత ఐదున్నర నెలల్లో జరిగిన ప్రమాదాలు..

- ఆగస్టు 21న ఎసైన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది మృతి, 38 మందికి పైగా కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి.
- ఆగస్టు 22న సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ యూనిట్-3లో రియాక్టర్ చార్జ్ చేస్తుండగా కెమికల్స్ లీకై మంటలు వ్యాప్తి.. ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతి
- అక్టోబర్ 5న యలమంచిలి ఫ్యూజన్ బ్రిక్స్ కంపెనీలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతి
- నవంబర్ 2న పరవాడ మెట్రోకెమ్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో రియాక్టర్ పేలిన ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలు
- నవంబర్ 13న రాంబిల్లిలోని ఒక పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులు మృతి
- తాజాగా పరవాడలోని ఠాగూర్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఒక కార్మికుడు మృతి



ఆస్పత్రికి 'ఎసైన్షియా' క్షతగాత్రుల తరలింపు (ఫైల్)

'ఠాగూర్'లో విషవాయువుల లీక్‌తో ఉలికిపాటు

- ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం
- మెడికవర్‌లో మరో ఆరుగురికి చికిత్స
- బాధితులను పరామర్శించిన కలెక్టర్, ఎస్పీ, మాజీ మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం/అక్కిరెడ్డిపాలెం: పరవాడ జేఎన్ ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా కంపెనీలోని యూనిట్-3లో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు జరిగిన ప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కంపెనీలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం లీకైన ఘటనలో 9 మంది కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. క్షతగాత్రులకు కంపెనీలోనే సపర్యలు చేసి బుధవారం ఉదయం 6 గంటలకు వడ్లపూడిలోని పవన్‌సాయి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అందులో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఒడిశా రాష్ట్రం, బాలానగర్ జిల్లా, బగ్‌దూర్ గ్రామానికి చెందిన హెల్పర్ అభిజిత్ దాస్ (23) బుధవారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. కెమిస్ట్‌గా పనిచేస్తున్న అగనంపూడికి చెందిన చిన్ని కృష్ణ (44), జూనియర్ మేనేజర్ (వేర్‌హౌస్)గా పనిచేస్తున్న పరవాడలో ఫార్మసీ కాలనీకి చెందిన వీరశేఖర్ (34) పరిస్థితి విషమంగా ఉంది. మిగతా ఆరుగురు కార్మికులు వీరబాబు, రాజారావు, పాపారావు, అనిల్‌కుమార్, విజయభాస్కర్, శరత్‌కుమార్‌లను నగరంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి నిలకడగా ఉంది. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.



ఫార్మా కంపెనీలో ప్రమాద బాధితుల వివరాలు వెల్లడిస్తున్న అనకాపల్లి కలెక్టర్ విజయ కృష్ణన్

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఠాగూర్ ఫార్మా కంపెనీలో పనిచేసే కార్మికుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంపెనీలో పనిచేస్తున్న 236 మంది కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా కలెక్టర్ విజయకృష్ణన్ పర్యవేక్షిస్తూ తెలుసుకుంటున్నారు. కార్మికులకు స్వయంగా కలెక్టర్ ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తక్షణమే వైద్య సదుపాయం అందించుటకు ఏర్పాట్లు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా శ్రీనివాసులు



ఎస్పీ తుహిన్ సిన్హాకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అనకాపల్లి: మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఇ.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు చేపట్టారు. డీఎస్పీల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడ నియమితులయ్యారు. ఎస్పీ తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

విశాఖలో హైకోర్టు బెంచ్‌పై సుప్రీం సీజేకు వినతి



సుప్రీంకోర్టు న్యాయవాది కృష్ణస్వామితో విశాఖ సీనియర్ న్యాయవాది ఐఎం అహ్మద్

విశాఖ లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు న్యాయవాది జి.కృష్ణస్వామితో కలిసి వినతి పత్రం అందించినట్లు హైకోర్టు సాధన సమితి కన్వీనర్ ఐఎం అహ్మద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు లిఖిత పూర్వకంగా కూడా ఒక ఫిర్యాదును సుప్రీంకోర్టుకు పంపినట్లు పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు అని చెప్పి విశాఖను పరిపాలనకు ఎంపిక చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో హైకోర్టు బెంచ్ కోసం ప్రభుత్వ పెద్దలు స్పందించడం లేదన్నారు. సీనియర్ న్యాయవాది గొలగాని అప్పారావు కూడ హైకోర్టు బెంచ్ విశాఖలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'కిశోరి వికాసం' అందరి కర్తవ్యం



కిశోరి వికాసం కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్ తదితర జిల్లా అధికారులు

- లింగ వివక్షను రూపుమాపాలి
- నేటి బాలలే రేపటి దిశానిర్దేశకులు
- స్త్రీకి ఆర్థిక స్వాతంత్య్రం ఉండాలి
- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : పిల్లలను లింగ వివక్ష చూపకుండా పెంచాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాలులో నిర్వహించిన 'కిశోరి వికాసం' జిల్లా స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల బాలికల హక్కులను గూర్చి తెలుసుకుని గ్రామస్థాయికి తీసుకువెళ్లాలన్నారు. బాలికల పట్ల ఎటువంటి వివక్ష చూపించకుండా చదువు చెప్పించాలన్నారు. వారు ఆర్థికంగా స్థిరపడిన తరువాత మాత్రమే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహాలు జరిపే వారిని ముందుగానే గుర్తించి నివారించాలన్నారు. బాలికలకు పౌష్టికాహారం అందించి, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు వారి సందేహాలను, సమస్యలను తల్లిదండ్రులతో చెప్పుకునే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. నైతిక విలువలు నేర్పాలని, ఓటములను తట్టుకొనే మానసిక స్థయిర్యం కల్పించాలని అన్నారు. పని ప్రదేశాల్లో స్త్రీలపై వేధింపులకు పాల్పడినా, బాడీ షేమింగు చేసినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు ప్రజలకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలన్నారు.

పిల్లలపై చదువుల ఒత్తిడి...

అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ బాలబాలికలు చదువుల లక్ష్యంతో మానసిక ఒత్తిడిలో ఉంటున్నారని, కుటుంబ సభ్యులు వారికి సమయం కేటాయించాలన్నారు. వారి సమస్యలను బయటివారితో పంచుకొనే అవకాశం కల్పించకుండా కుటుంబ సభ్యులు చర్చించి పరిష్కరించుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ధైర్యం చెప్పి, చదువులు కొనసాగించేలా ప్రోత్సహించాలన్నారు. డీఎల్‌డీఓ ఎస్.మంజులవాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు కె.అనంతలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, డాక్టర్ క్రాంతి, దిశ ఎస్ఐ రాములమ్మ, యోగ రిసోర్స్ పర్సన్ డాక్టర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సెర్ప్, మెప్మా, ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు.

దగా పడ్డ వలంటీరు..

నడి రోడ్డుపై నినాదాల హోరు





నెహ్రూచౌక్ వద్ద వలంటీర్ల మానవహారం (ఇన్‌సెట్) ఒక రోజు నిరశన దీక్ష చేస్తున్న వలంటీర్లు

అనకాపల్లి: సేవే పరమావధిగా పనిచేశారు.. ప్రజల అభిమానం చూరగొన్నారు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంతా తామై మెలిగారు.. వేతనం రూ.10 వేలు చేస్తానన్న సీఎం చంద్రబాబు మాట నిలుపుకోకపోవడంతో ఇప్పుడెంతో వేదన చెందుతున్నారు. తమ ఆవేదన ఆలకించమని నెహ్రూ చౌక్ కూడలిలో గ్రామ/వార్డు వలంటీర్లు బుధవారం మానవహారం నిర్వహించారు. ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. అంతకు ముందు జరిపిన భారీ ర్యాలీలో ఏపీ గ్రామ/వార్డు వలంటీర్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీప్తి, సీఐటీయూ జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, రూ.10 వేల జీతాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు మాసాల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. దేశంలో లక్షలాది మంది ఉద్యోగులను ఒకేసారి తొలగించడం అనేది ఎక్కడా జరగలేదని, ఏపీలోనే రెండు లక్షల 65 వేల మంది వలంటీర్లు వీధిన పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఉద్యోగం ఇవ్వకపోగా లక్షలాది మంది వలంటీర్లను తొలగించడంతోపాటు ఇసుక డిపోలు, ప్రభుత్వ మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పొట్ట కొట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని, వలంటీర్ల వ్యవస్థను కొనసాగించే విధంగా చర్యలు తీసుకుని తమ లక్షలాది కుటుంబాలకు న్యాయం చేయాలని వారు కోరారు. జిల్లా యూనియన్ నాయకులు కిరణ్, పీర్ సాహెబ్, విజయ్‌కుమార్, సంధ్య, అయోధ్య, గీత, ప్రసాద్, దేముడు, శ్యామల, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రైవాడ'లో సీడబ్ల్యూసీ నిపుణుల బృందం

- జలాశయం స్థితిగతుల పరిశీలన
- రూ.336 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- సాంకేతిక అంశాలపై అధ్యయనం
- 1.60 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసేలా గేట్ల పునరుద్ధరణ
- నివేదిక ఆధారంగా జలాశయం అభివృద్ధికి సాంకేతిక అనుమతులు
- ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ఎస్ఈ సుగుణాకర్‌రావు వెల్లడి

దేవరాపల్లి: రైవాడ జలాశయాన్ని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) నిపుణుల బృందం బుధవారం సందర్శించింది. బృంద సభ్యులైన హర్యానాకు చెందిన సాంకేతిక నిపుణులు అఖిలేష్, ఈజిప్టుకు చెందిన సివిల్ ఎక్స్‌పర్ట్ హనీతో పాటు రాష్ట్ర ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఎస్.సుగుణాకర్‌రావు, విజయవాడకు చెందిన ఇరిగేషన్ ఎస్ఈ యాస్టికా, ఈఈ విజయానంద్, జిల్లా ఈఈ త్రినాథం తదితర్లు జలాశయాన్ని పరిశీలించారు. సాంకేతిక అంశాలపై అధ్యయనం చేయడంలో భాగంగా జలాశయం వరద గేట్లు, స్పిల్‌వే, కుడి, ఎడమ కాలువల మదులంను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. జలాశయం వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ఫొటోలను తీసుకున్నారు.

ప్రపంచ బ్యాంకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

డ్యామ్ రీహేబిలిటేషన్ ఇరిగేషన్ ప్రాజెక్టు (డ్రిప్) పథకంలో రైవాడ జలాశయం అభివృద్ధికి రూ.336 కోట్ల ప్రపంచ బ్యాంక్ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు చేసిన నేపథ్యంలో సాంకేతికపరమైన అంశాల పరిశీలనకు సీడబ్ల్యూసీ బృందం వచ్చిందని రాష్ట్ర ఇరిగేషన్ సీఈ సుగుణాకర్ తెలిపారు. నిపుణుల పర్యవేక్షణ అనంతరం నివేదికను సీడబ్ల్యూసీ చైర్మన్‌కు అందిస్తారని, ఈ నివేదిక ఆధారంగా జలాశయ అభివృద్ధికి సాంకేతిక అనుమతులు రాగానే నిధులు మంజూరవుతాయన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న 10 వర్టికల్ స్పిల్‌వే గేట్లను రేడియల్ గేట్లుగా మార్చి, అదనంగా మరో స్పిల్‌వే గేటు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. స్పిల్‌వే గేట్ల ద్వారా 1.60 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేసేలా గేట్లను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.



ఎడమ కాలువ స్లూయిస్‌ను పరిశీలిస్తున్న సీడబ్ల్యూసీ నిపుణులు అఖిలేష్, హని తదితరులు

రూ.వెయ్యి కోట్లతో మూడు జలాశయాల అభివృద్ధి

రాష్ట్రంలో రూ. వెయ్యి కోట్లతో శ్రీశైలం, ధవళేశ్వరం, రైవాడ జలాశయాలను ప్రభుత్వం అభివృద్ధి చేయనున్నట్లు సుగుణాకర్ తెలిపారు. ముందుగా సీడబ్ల్యూసీ బృందాన్ని ఎమ్మెల్యే బండారు కలిసి, జలాశయ ప్రాధాన్యతను వివరించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు వేములపూడి విద్యార్థి



విద్యార్థి తులసిరాజ్‌తో హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు

నర్సీపట్నం: ఈ నెల 24, 25 తేదీల్లో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్‌–14 బేస్‌బాల్ పోటీల్లో విశాఖ జిల్లా తరఫున నర్సీపట్నం మండలం వేములపూడి పీబీఎం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి పి.తులసి రాజ్ ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. తులసిరాజ్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు డి.రవిని హెచ్‌ఎం జి.రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ వేమాల తల్లి, ఉపాధ్యాయులు అభినందించారు.

పూడిమడక రోడ్డు విస్తరణకు చర్యలు



మునగపాక, తిమ్మరాజుపేటలలో పర్యటిస్తున్న ఆర్‌డీవో ఆయిషా

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణ ప్రక్రియ వేగవంతం కావాలని, ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా కోరారు. రోడ్డు విస్తరణకు సంబంధించి బుధవారం ఆమె మునగపాక, తిమ్మరాజుపేట, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఏయే గృహాలు దెబ్బతింటాయన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది లబ్ధిదారులను గుర్తించారనే వివరాలు సేకరించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి మెరుగైన పరిహారం అందుతుందన్నారు. రోడ్డు విస్తరణకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీ–సర్వే డీటీ పడాల్, వీఆర్వోలు సురేష్, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరిపై అడ్వంచర్స్ ప్రారంభం

ఆరిలోవ(విశాఖ): కై లాసగిరిపై అడ్వంచర్స్ స్పోర్ట్స్ అందుబాటులోకి వచ్చాయి. పీపీపీ పద్ధతిలో నిర్వహించే స్కై సైక్లింగ్, జిప్ లైనర్‌లను బుధవారం వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, ఎమ్మెల్యే రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జిప్ లైనర్, స్కై సైక్లింగ్ చేశారు. సుమారు రూ.2 కోట్లు వ్యయంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

కక్ష కట్టి.. పక్కన పెట్టేశారా.!

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావస్తోంది. ఇప్పటి వరకు విశాఖ అభివృద్ధి ఊసే లేదు. కొత్త ప్రాజెక్టుల రూపకల్పనపై దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వంలో రూపొందించిన ప్రణాళికలను సైతం పక్కన పెట్టేసినట్లు కనిపిస్తోంది. దీంతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా వీఎంఆర్డీఏ తయారు చేసిన అనేక ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ప్రాజెక్టుల రూపకల్పనకు రూ.కోట్లు వెచ్చించి రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు బుట్టదాఖలయ్యే పరిస్థితి కనిపిస్తున్నాయి. – విశాఖ సిటీ

- పర్యాటక ప్రాజెక్ట్‌లకు కూటమి గ్రహణం
- గత ప్రభుత్వ హయాంలో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- నాడు అభివృద్ధి పనులపై విష ప్రచారం
- నేడు అధికారంలో ఉన్నా పట్టించుకోని వైనం
- డీపీఆర్‌లకు వెచ్చించిన రూ.కోట్లు వృథా?



విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విభిన్నమైన, ఆకర్షణీయమైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందుకు తగ్గట్టుగా విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్డీఏ) కొన్ని కీలక ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేసింది. నేచురల్ హిస్టరీ పార్క్, ఓషన్ డెక్, అర్బన్ అమ్యూజ్‌మెంట్ పార్క్, సైన్స్ మ్యూజియం, కైలాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్, కాటేజ్ ఇలా అనేక ప్రాజెక్టుల ఏర్పాటుకు డీపీఆర్‌లు సైతం రూపొందించింది. 2014 నుంచి 2019 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం విశాఖలో ఒక్క పర్యాటక ప్రాజెక్టు చేపట్టకపోగా.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తయారు చేసిన ప్రతిపాదనలపై తాజాగా కూటమి ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

నాడు ప్రమాదం.. నేడు ప్రమోదం

కూటమి నేతల కుట్ర ఇప్పుడిప్పుడే ప్రజలకు అర్థమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ప్రారంభించే ప్రతి ప్రాజెక్టుకు అడ్డంకులు సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు అవే ప్రాజెక్ట్‌లు అద్భుతమని బాకాలు ఊదుకుంటున్నారు. అందుకు ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటే నిదర్శనం. పర్యాటకులకు సాగర కెరటాల సయ్యాటల అనుభూతిని పంచేందుకు సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంతంలో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటుకు వీఎంఆర్డీఏ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయి. ప్రాజెక్ట్ ట్రయల్ రన్ సమయంలో కూటమి నేతలు ఆ బిడ్జిపై విష ప్రచారం చేశారు. విశాఖ సాగరతీరం ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌కు అనుకూలం కాదని ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఇపుడు అదే ఫ్లోటింగ్ బ్రిడ్జిని ప్రమాదకరమైన, కెరటాల ఉధృతి ఎక్కువగా ఉండే రుషికొండ బీచ్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని సైతం సందర్శించింది. నాడు ప్రమాదకరమైన ప్రాజెక్టు.. ఇప్పుడు ఆహ్లాదకరంగా ఎలా మారిందన్న ప్రశ్న సర్వత్రా ఉత్పన్నమవుతోంది. 2019లో అధికారం కోల్పోయిన చంద్రబాబు, అతని టీం విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. అమరావతికి ముప్పువాటిల్లుతోందన్న భయంతో విశాఖ చేపట్టే ప్రతి ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నాలు చేసింది. పర్యాటక ప్రాజెక్టుల విషయంలో కూడా ఏదో సాకుతో కోర్టులో కేసులు వేయిస్తూ.. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ వచ్చింది. తాజాగా గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ప్రాజెక్టులను పక్కనపెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



అయోమయంలో ప్రాజెక్టులు..

విశాఖలో పర్యాటక కేంద్రాల అభివృద్ధి కోసం వీఎంఆర్డీఏ పలు ఆహ్లాద, వినోద, క్రీడా, పర్యాటక ప్రాజెక్టులకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు దాటినప్పటికీ.. ఇప్పటి వరకు వాటిపై కదలిక లేకుండా పోయింది. గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన అన్ని ప్రాజెక్టులను నిలిపివేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి అధికారులు మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో డీపీఆర్‌లు సైతం సిద్ధమైన కీలక ప్రాజెక్టుల భవితవ్యం అయోమయంగా మారింది.

- రూ.40కోట్ల అంచనా వ్యయంతో పీపీపీ పద్ధతిలో అమ్యూజ్‌మెంట్, గేమింగ్, ఫన్, స్కేటింగ్, అక్వేరియం.. ఇలా అన్ని రకాల ఆహ్లాద, వినోద కేంద్రాలు ఒకే చోట విశాఖ ప్రజలను అలరించేలా ప్రణాళికలు రూపొందించింది. పోలీస్ బ్యారెక్స్ సమీపంలో వైశాఖీ జల ఉద్యానవనం స్థలంలో 'అర్బన్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫన్ జోన్'కు ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణకు వీఎంఆర్డీఏ బిడ్లు సైతం ఆహ్వానించింది.
- కాపులుప్పాడ ప్రాంతంలో నేచురల్ హిస్టరీ పార్కు అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేసింది.
- గ్లాస్ బ్రిడ్జిపై నడుస్తూ సముద్ర అందాలను ఆస్వాదించేలా రూ.7.8 కోట్లతో ఓ ప్రాజెక్ట్ రూపొందించింది. వీఎంఆర్డీఏ పార్క్‌కు ఆగ్నేయంగా సముద్రం ఒడ్డు నుంచి సముద్రం లోపలకు 91 మీటర్ల పొడవుతో ఓషన్ డెక్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్(ఏపీయూఐఏఎంఎల్) డిజైన్ సిద్ధం చేసింది. సీఆర్‌జెడ్ అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని భావించింది.
- కైలాసగిరిపై రూ.4.69 కోట్లతో సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణానికి వీఎంఆర్డీఏ అధికారులు పంపించిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.
- రూ.18 కోట్లతో కైలాసగిరిపై కాటేజీలు, రివాల్వింగ్ రెస్టారెంట్ ప్రాజెక్టు పనులను తిరిగి చేపట్టేందుకు అనుమతులు మంజూరు చేసింది.

ఇలా మరికొన్ని పర్యాటక ప్రాజెక్టులకు వీఎంఆర్డీఏ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

పెళ్లైన నెల రోజులకే అనంత లోకాలకు..

- ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుల దుర్మరణం
- మృతులిద్దరూ మేనమామ, మేనల్లుడు



ప్రమాదంలో మృతి చెందిన పవన్‌కుమార్



ప్రమాదంలో మృతి చెందిన రూపేష్‌కుమార్



పవన్‌కుమార్, రూపేష్‌కుమార్ (ఫైల్)

ఉక్కునగరం(విశాఖ): పెళ్లైన నెల రోజులకే ఒక యువకుడికి నిండు నూరేళ్లు నిండి పోయాయి. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువకులు ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన.. ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. మృతులిద్దరూ మేనమామ, మేనల్లుడు కావడం గమనార్హం. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ దరి ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన డబ్బీరు పవన్ కుమార్(31) పరవాడ ఫార్మాసిటీలో పనిచేస్తూ కూర్మన్నపాలెం దరి శాతావాహన నగర్‌లో నివాసముంటున్నాడు. అతని మేనల్లుడు కొండవలస రూపేష్‌కుమార్(21) హైదరాబాద్‌లో సీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇద్దరూ కలిసి బైక్‌పై స్టీల్‌ప్లాంట్ ప్రధాన మార్గంలో కణితి జంక్షన్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కూర్మన్నపాలెం నుంచి కణితి జంక్షన్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు బైక్‌ను సుమారు 30 మీటర్లు ఈడ్చుకుపోయింది. ఇద్దరిపై ఆర్టీసీ బస్సు టైర్లు ఎక్కడంతో.. వీరు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పవన్‌కుమార్ బంధువులు అక్కడకు చేరుకుని రోదించిన తీరు అందరినీ కలచి వేసింది. పవన్‌కుమార్‌కు గత నెల 26న వివాహమైంది. మరికొన్ని రోజుల్లో భార్యను తీసుకువచ్చేందుకు చూస్తున్న ఈ సమయంలో ఇలా జరిగిందంటూ అతని అక్క కన్నీటి పర్యంతమైంది. రూపేష్ కుమార్ ఇక్కడకు ఎందుకు వచ్చాడో తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదం అనంతరం ఆర్టీసీ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు లొంగిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం వారి మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్వరితగతిన 'అపార్' ప్రక్రియ పూర్తి చేయాలి





సమావేశానికి హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అపార్ యాప్‌లో విద్యార్థుల వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. స్థానిక గవరపాలెం చిన్న హైస్కూల్ ఆవరణలో బుధవారం ఎంఈవోలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెంఎంలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ ప్రక్రియ ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో చాలా మందకొడిగా ఉందన్నారు. దీనిపై ఎంఈవోలు దృష్టి సారించాలన్నారు. వచ్చేనెల 7న జరగనున్న పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం)ను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు త్వరితగతిన ఎఫ్ఏ 1, 2 మార్కుల సబ్మిషన్ పూర్తి చేయాలన్నారు. మెగా పీటీఎం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. పేరెంట్ టీచర్ మీటింగ్‌కు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 5 పాఠశాలలను విద్యా శాఖ నేరుగా ఎంపిక చేసిందన్నారు. ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకం బిల్లులను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని ఆయన సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకల్లా ఉపాధ్యాయుల బయోమెట్రిక్, 10.30 కల్లా స్టూడెంట్స్ అటెండెన్స్ పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



లాలం కొత్తూరులో ఏర్పాటు చేసిన మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న



ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి లచ్చన్న

కె.కోటపాడు: ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి సిహెచ్.లచ్చన్న కోరారు. మండలంలోని సుందరయ్యపేట శివారు లాలం కొత్తూరులో కూండ్రపు అరుణ ఏర్పాటు చేసిన నూకాంబిక మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మినీ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటు చేసి, రైతులకు కషాయాలు, ద్రావణాలు, పీఎండీఎస్ విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పంటలకు ఆశించిన తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి నివారణకు అవసరమైన కషాయాలు తయారు చేసి రైతులకు అందించాలని సూచించారు. ఇలా రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రజలు కూడా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యవంతులుగా జీవనం సాగించాలని సూచించారు. ఈ మెగా ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకొని మిగతా మండలాల్లో కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, జిల్లా యాంకర్ గోవింద, హెచ్‌ఆర్ శ్యామల, మార్కెటింగ్ ఇన్‌చార్జి వర్మ, డివిజనల్ ఇన్‌చార్జిలు శివకుమార్, తాసుబాబు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి ప్రత్యేక పూజలు



స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి చందనం, పసుపు, తేనెతో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



వివిధ రకాల పూల అలంకరణలో స్వయంభూ గౌరీశ్వరస్వామి

చోడవరం: కార్తీకమాసం పవిత్ర బహుళ పక్షం ద్వాదశి ప్రత్యేక పూజలు చోడవరంలోని స్వయంభూ గౌరీశ్వరస్వామి, స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గౌరీశ్వరస్వామికి క్షీరాభిషేకం, మారేడు పత్రి పూజ చేశారు. స్వామిని వివిధ వర్ణాల పూలతో సుందరంగా అలంకరించారు. స్వయంభూ విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేకంగా క్షీరాభిషేకం, పసుపు, గంధం, తేనేతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వయంభూ గౌరీశ్వరస్వామి తిరువీధి రథోత్సవం శుక్రవారం జరగనుందని, భక్తులంతా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఛత్తీస్‌గఢ్‌ను గెలిపించిన శశాంక్

- మరో మ్యాచ్‌లో చండీగఢ్‌పై అసోం విజయం



విజయం సాధించిన అసోం జట్టు

విశాఖ స్పోర్ట్స్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీ పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో రైల్వేస్‌పై ఛత్తీస్‌గఢ్ మరో బంతి ఉండగా మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. డేనైట్‌గా జరిగిన మరో మ్యాచ్‌లో అసోం జట్టు చండీగఢ్‌పై గెలుపొందింది. దీంతో గ్రూప్ డీలో ఎనిమిదేసి పాయింట్లతో అసోం, చండీగఢ్, విదర్భ ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి స్టేడియంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. కెప్టెన్ ఉపేంద్ర(68), అశుతోష్(59) అర్ధసెంచరీలతో రాణించారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గఢ్ ఏడు వికెట్లు కోల్పోయి మరో బంతి ఉండగా విజయలక్ష్యాన్నందుకుంది. కీపర్ బ్యాటర్ శశాంక్ 57 పరుగులు చేసి.. మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో టాస్ గెలిచిన చండీగఢ్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో అసోం తొలుత బ్యాటింగ్ చేసింది. 19.1 ఓవర్లలోనే 150 పరుగులకు ఆలౌటైంది. సాహిల్ (51) అర్ధసెంచరీ నమోదు చేశాడు. ప్రతిగా బ్యాటింగ్ చేసిన చండీగఢ్ 19.1 ఓవర్లలో 139 పరుగులు చేసి ఓటమి పాలైంది.

ముగిసిన గిరిజన స్వాభిమాన ఉత్సవాలు



జ్ఞాపికలు బహూకరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఏయూక్యాంపస్(విశాఖ): గిరిజన స్వాభిమాన ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. జనజాతి గౌరవ్ దివస్ వేడుకల్లో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ, టీజీఆర్–టీఎం, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో ఈ నెల 15 నుంచి 26 వరకు గ్రామ, పంచాయతీ, ఐటీడీఏ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జనజాతి గౌరవ్ దివస్ నిర్వహించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి తెలియజేసే విధంగా ఈ కార్యక్రమాలను జరిపారు. స్వాభిమాన ఉత్సవాల్లో భాగంగా గిరిజన సంత, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రుషికొండ వద్ద ఏర్పాటుచేసిన గిరిజన సంత, బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌లో గిరిజన ఉత్పత్తులు విక్రయాలు జరిపారు. ఈ కార్యక్రమాలలో ఎనిమిది ఐటీడీఏలు, 17 జిల్లాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు, సాంస్కృతిక బృందాలు పాల్గొన్నాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో ప్రథమ స్థానాన్ని సీతంపేట, రెండో స్థానం పాడేరు ఐటీడీఏలు కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణి మంద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండున్నరేళ్ల తర్వాత కుటుంబం చెంతకు

తాతా మనవడిని కలిపిన రెడ్‌క్రాస్ హోంలెస్ షెల్టర్



తాతతో మనవడు క్రాంతికుమార్, అతని స్నేహితుడు

మహారాణిపేట(విశాఖ): ఏడు పదుల వయసు. భార్య కరోనాతో మరణించింది. కొడుకు కుటుంబంతో ఇమడలేనంటూ చెప్పాపెట్టకుండా బయటకు వచ్చేశాడు. కొడుకు వెతుకులాడినా ప్రయోజనం లేకపోయింది. తీరా మనసు మార్చుకుని కొడుకు వద్దకు వెళ్లాలనుకునేసరికి కొడుకు ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. మరో దిక్కు లేక రోడ్డున పడ్డ అతన్ని నగరంలోని పెదవాల్తేర్‌లో ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హోంలెస్ షెల్టర్ ఆదుకుంది. వారి చొరవతో రెండున్నరేళ్ల తర్వాత ఆ అభాగ్యుడు తన కుటుంబం వద్దకు చేరుకోగలిగాడు. సినిమా స్టోరీని తలపించే ఈ వ్యథలో ప్రధాన వ్యక్తి మధురవాడ ప్రాంతానికి చెందిన గొలగాని చింతాలు(70). భార్య లక్ష్మి కరోనా సోకి మరణించడంతో కొడుకు పాల్ వద్దకు చేరాడు. కుటుంబ సమస్యలతో ఎవరికీ చెప్పకుండా 2022లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కొడుకు పాల్ ఎంతగా వెతికించినా ప్రయోజనం లేకపోయింది. కొన్నాళ్ల తర్వాత చింతాలు తన కొడుకు ఇంటికి వెళ్లాడు. అప్పటికే కొడుకు కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇంటికి తాళం వేసి ఉండటం, ఇరుగు పొరుగువారు కూడా హైదరాబాద్‌లో ఎక్కడ ఉంటున్నారో తెలియదని చెప్పడంతో మళ్లీ రోడ్డున పడ్డాడు. చివరకు విశాఖ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫామ్‌ను ఆశ్రయించాడు. 2022 జూన్ 1న రెడ్‌క్రాస్ సిబ్బంది రైల్వే స్టేషన్ ప్రాంతంలో రెస్క్యూ చేస్తుండగా చింతాలు ప్లాట్‌ఫామ్‌పై నిద్రిస్తూ కనిపించాడు. ఆరా తీసి, ఆయన్ను హోంలెస్ షెల్టర్‌కు తరలించారు. చింతాలు కుడి కన్నుకు సమస్య రావడంతో విశాఖ ఐ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది మధురవాడ వెళ్లి చింతాలు కుమారుడి కోసం ఆరా తీయగా, తమకు దొరికిన సమాచారంతో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో వారు ఉంటున్నట్లు తెలుసుకున్నారు. చివరకు పాల్ అడ్రస్ దొరకడంతో సమాచారం అందించారు. చింతాలు మనవడు క్రాంతికుమార్ తన స్నేహితుడితో కలిసి రెడ్‌క్రాస్ షెల్టర్‌కు వచ్చాడు. తాతను చూసిన ఆనందం, బాధ కలగలిపి కన్నీళ్లు పెట్టుకున్నాడు. తన తాతను చూసి రెండున్నరేళ్లయిందని, ఆయన ఆచూకీ దొరక్క చనిపోయాడనుకున్నామని చెప్పాడు. తాతను తమకు క్షేమంగా అప్పగించినందుకు రెడ్‌క్రాస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్ల తర్వాతనైనా చింతాలును వారి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించడం సంతోషంగా ఉందని షెల్టర్ మేనేజర్ మురళి ఆనందం వ్యక్తం చేశారు.

హ్యాపీ బర్త్‌డే దళపతి



జూలో నీటి ఏనుగు

ఇందిరాగాంధీ జూ పార్కులో నీటి ఏనుగు జూనియర్ దళపతి 7వ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు, సీపీఈ కళాశాల విద్యార్థులు నీటి ఏనుగు మాస్కులతో సందడి చేశారు. జూ ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ, సీపీఈ కళాశాల సీఈవో ఆదినారాయణ, జూ అధికారులు కలిసి కేక్ కట్ చేసి సందర్శకులకు పంచిపెట్టారు. అనంతరం కళాశాల విద్యార్థులు కూరగాయలు, వివిధ పండ్లతో తయారు చేసిన ఆహారాన్ని జూకు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సీపీఈ కళాశాల యాజమాన్యానికి ఇన్‌చార్జి క్యూరేటర్ కృతజ్ఞతలు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జూ అసిస్టెంట్ క్యూరేటర్ జి.గోపి, జూ పరిపాలన విభాగం సూపరింటెండెంట్ ఉమాదేవి, వైద్యులు, యానిమల్ కీపర్లు పాల్గొన్నారు. – ఆరిలోవ(విశాఖ)

క్లుప్తంగా

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలి

అనకాపల్లి: పరవాడ మండలం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ ఠాగూర్ లేబరేటరీలో జరిగిన ప్రమాదంపై సమగ్రమైన విచారణ చేపట్టి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఫార్మా సిటీలో తరచూ జరుగుతున్న ప్రమాదాలకు యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమని, మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 9 మంది కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఉదాసీన వైఖరి వల్ల కంపెనీ యాజమాన్యాలకు కాసులు, కార్మిక కుటుంబాలకు కన్నీళ్లు మిగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: స్థానిక విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో ఈనెల 28న విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 7 నుంచి 2 గంటల వరకూ విద్యుత్ నిలుపుదల జరుగుతుందని ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏడీ త్రినాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డి–1 సెక్షన్ పరిధిలో నర్సింగరావుపేట, చవితివీధి, జీవీ కోటేశ్వరరావువీధి, రైల్వే స్టేషన్ రహదారి, మళ్లవీధి, కోట్ని వీధి, గాంధీ బొమ్మ జంక్షన్, చింతావారి వీధి, నూకాంబిక కోల్డ్ స్టోరేజ్ ఏరియా, పిల్లా వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల జరగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

శారదా నదిలో పేరుకుపోయిన చెత్త



శారదా నదిలో గుట్టలుగా చెత్త

కశింకోట: కశింకోటలోని కాశీమదుం గ్రోయిన్ దిగువ శారదా నదిలో పేరుకుపోయిన చెత్త కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీ గ్రామంలో సేకరించిన చెత్తను తెచ్చి ఇక్కడ పోస్తున్నారు. ఇది పెద్ద కుప్పగా పేరుకుపోయి అధ్వానంగా మారింది. దీనివల్ల దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెంది ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీన్ని వేరే చోటికి తరలించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఇటీవల ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి నివేదించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 3,516 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,410
మొదటి రకం	3,480	4,150
రెండో రకం	3,130	3,630
మూడోరకం	2,940	3,110

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరులో సంప్రదించవచ్చు.

నీరు వృథా.. రైతు వ్యథ



కశింకోటలో దెబ్బతిన్న కాశీ మదుం గ్రోయిన్



పెద్ద గండి నుంచి వృథాగా దిగువకు పోతున్న నీరు

- దెబ్బ తిన్న కాశీ మదుం గ్రోయిన్
- ఆయకట్టు భూములకు అందని నీరు
- దిగుబడి లేక నష్టపోతున్నామని అన్నదాతల గగ్గోలు

కశింకోట: స్థానిక శారదా నదిపై ఉన్న కాశీ మదుం గ్రోయిన్ దెబ్బ తింది. దీంతో నీరు దిగువకు వృథాగా పోవడం వల్ల ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. దీంతో తాము నష్టపోవలసి వస్తుందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. కాశీ మదుం గ్రోయిన్ కింద సుమారు 940 ఎకరాల ఆయకట్టు ఉంది. గ్రోయిన్‌కు ఉన్న రెండు కాలువల ద్వారా కశింకోట, వెదురుపర్తి, అచ్యుతాపురం మండలానికి చెందిన పెదపాడు గ్రామాలకు చెందిన భూములకు సాగునీరు అందుతోంది. అయితే గ్రోయిన్ దాదాపు దశాబ్దం క్రితం దెబ్బతింది. దీనికి అప్పటి నుంచి పూర్తి స్థాయిలో మరమ్మతులు లేవు. దీంతో క్రమేపీ శిథిలమై పెద్ద గండ్లు పడి వాటి ద్వారా దిగువకు నీరు వృథాగా పోతోంది. ఆయకట్టు స్థాయిలో నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో ఆయకట్టు భూములకు సాగు నీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. ముందు ఉన్న భూములకు వినా చివరి పంట భూములకు సాగు నీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో దీని కింద సాగు చేసే వరి, చెరకు రైతులు తమ పంటలు సరిగ్గా పండక తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. వర్షాధారం కావడం వల్ల కొందరు పంటలు వేయకుండా ఖాళీగా ఉంచే పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. దీని దృష్ట్యా పూర్తి స్థాయిలో గ్రోయిన్ గండ్లు పూడ్చి మరమ్మతులు చేపట్టి సాగు నీరు అందివ్వాలని, ఇందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నీరు వృథాగా పోతోంది..



కాశీమదుం గ్రోయిన్‌కు దాదాపు దశాబ్ద కాలంగా పూర్తి స్థాయిలో మరమ్మతులు లేవు. గ్రోయిన్ దెబ్బ తిని నీరు వృథాగా దిగువకు పోతోంది. ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదు. దీంతో రైతులు ఏటా నష్టపోతున్నారు. గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు పూర్తి స్థాయిలో అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. – **బొడ్డేడ సత్యసాయి బాలాజీ, రైతు, కశింకోట**

పంటలు ఎండిపోతున్నాయి..



కాశీమదుం గ్రోయిన్ కింద సుమారు రెండు ఎకరాల భూమిని సాగు చేస్తున్నాం. గ్రోయిన్ దెబ్బ తినడం వల్ల ఆయకట్టు నుంచి అరకొరగానే సాగునీరు అందుతోంది. దీంతో పంటల దిగుబడి తగ్గిపోయి ఏటా నష్టపోవలసి వస్తోంది. గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టి పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.

–**అళ్ల జగదీశ్వరరావు, రైతు, వెదురుపర్తి**

ప్రభుత్వానికి ప్రతిపాదించాం..

రూ. 40 లక్షలతో కాశీమదుం గ్రోయిన్ మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఇంకా నిధులు మంజూరు కావలసి ఉంది. నిధులు మంజూరు కాగానే మరమ్మతు పనులు చేపట్టి సాగుకు నీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– **ఎం. అమూల్య, ఏఈ, నీటిపారుదల శాఖ, అనకాపల్లి డివిజన్.**

క్విజ్ పోటీలతో గణితంపై పట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్నప్ప హెచ్‌ఎం జీవీకే ఆచారి

కశింకోట: విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనడం వల్ల వేగంగా, సునాయాసంగా గణితం నేర్చుకోవడానికి, దానిపై అవగాహన పెంచుకోవడానికి అవకాశం ఉంటుందని హెచ్‌ఎం జీవీకే ఆచారి అన్నారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూల్లో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహిస్తున్న గణిత మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తుండడం వల్ల జట్టు పని (టీం వర్క్) అలవడుతుందన్నారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి, పీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ గణిత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఆట, పాట, నృత్యం, కథలు, లఘు నాటిక, క్విజ్ పోటీల ద్వారా వినూత్న పద్ధతిలో బోధిస్తూ గణితంపై ఆసక్తి కలిగించడానికి కృషి చేస్తున్నామన్నారు. వివిధ రూపాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సభిత లక్ష్మి, సత్యవేణి, చిన్నారావు, సోమరాజు, విజయ్, విజయలక్ష్మి, ఎ. నూకరాజు, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అట్టలు, జామెట్రీ బాక్స్‌ల అందజేత

కశింకోట: మండలంలోని బయ్యవరం హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు పరీక్ష రాసే అట్టలు, జామెట్రీ బాక్స్‌లను బుధవారం అందజేశారు. గంటా యువసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు వీటిని పంపిణీ చేశారు. పరీక్షల్లో అధిక శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేన ప్రతినిధులు జెర్రిపోతుల నూకినాయుడు, గొంతిన గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

అనకాపల్లి: మండలంలో రేబాక గ్రామంలో మైనర్ బాలిక అదృశ్యమైనట్లు రూరల్ పోలీస్‌లకు బుధవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు రేబాక గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఈనెల 25న ఇంటి నుంచి షాప్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. అయితే నేటికీ తిరిగి రాకపోవడంతో బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈవోఆర్డీ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



ఎంపికైన జిల్లా ఈవోఆర్డీ నూతన కార్యవర్గం

అనకాపల్లి: జిల్లా విస్తరణ అధికారుల కార్యవర్గ సంఘం (ఈవోఆర్డీ) అధ్యక్షునిగా ఒ.మహేష్ (చోడవరం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక గాంధీనగరం ఎస్ఆర్ శంకరం సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా సీతామహాలక్ష్మి (మాకవరపాలెం), ఉపాధ్యక్షునిగా కె.ధర్మారావు (పరవాడ), సహాయ కార్యదర్శిగా జి.సత్యనారాయణ (ఎస్.రాయవరం), కోశాధికారిగా ఎం.వెంటకలక్ష్మి (కశింకోట), గౌరవాధ్యక్షునిగా కె.కరుణాకర్ (వి.మాడుగుల) ఎన్నికయ్యారు. పై కమిటీ మూడు సంవత్సరాలు ఉంటుందని అధ్యక్షుడు ఒ.మహేష్ తెలిపారు.

ఆకట్టుకున్న మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ ద్వారా మనిషిని రక్షించే విధానం చూపుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు

అనకాపల్లి: స్థానిక శారదా నది ఒడ్డున బుధవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను ఎలా కాపాడాలనే దానిపై మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, ఆర్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌షాప్‌లో మద్యం బాటిళ్ల గుర్తింపు

అనకాపల్లి: మండలంలో గుండాల జంక్షన్‌లోని పాన్‌షాప్‌ను తనిఖీ చేయగా 30 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించినట్లు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పాన్‌షాప్‌లు తనిఖీ చేస్తుండగా అక్రమ మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెట్ల నీడన భయం.. భయం

- పాఠశాల ప్రాంగణంలో కాలం చెల్లిన భారీ వృక్షాలు
- తుపాన్లు, గాలులకు విరిగిపడుతున్న కొమ్మలు
- ఆటలకు దూరమైన విద్యార్థులు
- గిరిజన ఆశ్రమ విద్యార్థుల ఇక్కట్లు



గిరిజన ఆశ్రమ పాఠశాలలో భారీ వృక్షాలు

నాతవరం : గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు భయం గుప్పిట్లో విద్యబోధన నడుస్తుంది. మండలంలో సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో సుమారుగా 142 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల ప్రాంగణంలో కాలం చెల్లిన భారీ వృక్షాలు ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాలం వెళ్ల దీస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఎత్తయిన భారీ వృక్షాలు కారణంగా ఈదురు గాలలు వీచినప్పుడు శబ్దం రావడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని బయటకు రావడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం అంటున్నారు. భారీ వృక్షాల్లో కొన్ని కాలం చెల్లి ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా దర్శనమిస్తున్నాయి. పాఠశాల భవనాలు మధ్యలో భారీ వృక్షాల కారణంగా విద్యార్థులను ఆటలు ఆడుకునేందుకు సైతం ఉపాధ్యాయులు బయటకు పంపించడం లేదు. ఇటీవల సంభవించిన తుపాను సమయంలో గాలలుకు చెట్ల కొమ్మలు విరిగిపడడంతో తృటిలో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు బహిరంగంగా అంటున్నారు. ఆ సంఘటన జరిగిన దగ్గర్నుంచి వర్షం పడినా ఏమాత్రం గాలులు వీచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం భవనాల్లోంచి బయట చెట్ల కిందకు రావడానికి హడలెత్తిపోతున్నారు.

ప్రహరీ నిర్మించారు.. గేటు మరిచారు..

గిరిజన ఆశ్రమ పాఠశాల చుట్టూ లక్షలాది రూపాయలతో ప్రహరీ నిర్మించారు. పాఠశాలకు ప్రధాన గేటు ఏర్పాటు చేయడం మరిచారు. పాఠశాల ఉపాధ్యాయులు తాత్కాలికంగా కర్రలతో గేటు ఏర్పాటు చేసుకున్నారు. ప్రహరీగోడ ఉన్న గేటు లేక పోవడంతో రాత్రి సమయంలో అల్లరి మూకలు పాఠశాల ప్రాంగణంలోకి వచ్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గేటు ఏర్పాటు చేయకపోవడం వలన ప్రహరీ గోడ ఉన్నా ఎలాంటి ఉపయోగం ఉండడం లేదు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం : టీడబ్ల్యూ డీడీ నాగశిరీష

ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు నాగ శిరీష వద్ద 'సాక్షి' ప్రస్తావించగా రామన్నపాలెం ఆశ్రమ పాఠశాలలో భారీ వృక్షాలు, గేటు సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే చెట్లు తొలగించేందుకు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే గేటు విషయం వెంటనే సంబంధిత కాంట్రాక్టరు, ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి గేటు ఏర్పాటు చేస్తానన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి



మోడల్ స్కూల్‌లో చీడికాడ ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో హేమసుందర్

చీడికాడ : పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంపీడీవో హేమసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని మంచాల మోడల్ స్కూల్, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆయన మంచాల కేంద్రాన్ని పరిశీలించారు. తమ ఆధార్‌లో తప్పులను సవరించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి ఉన్నారు.

ఆవుపాల ధరను పునరుద్ధరించాలి



గొండుపాలెంలో పాడి రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు యర్రా దేముడు

కె.కోటపాడు : విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించాలని సీపీఎం నాయకుడు యర్రా దేముడు అన్నారు. ఈ విషయమై డిసెంబర్ 2న చేపడుతున్న విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని బుధవారం గొండుపాలెంలో పాడి రైతులను కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. రైతుల వద్ద నుంచి సేకరిస్తున్న ఆవు పాల ధరకు, అమ్మకం ధరకు గల వ్యత్యాసం రూ.10లను రైతులకు చెల్లించే ధరలో కలపాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ సభ్య రైతులకు నాలుగు నెలలకు ఒకసారి బోనస్‌ను చెల్లించాలన్నారు. ఆవుపాలకు గరిష్ఠంగా లీటర్‌కు రూ.50, గేదె పాలకు లీటర్‌కు రూ.75 చెల్లించడంతో పాటు దాణాను 75 శాతం రాయితీపై రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కళాశాలలో చిత్ర బృందం సందడి



తమ చిత్రం వివరాలు వెల్లడిస్తున్న నటీనటులు, సాంకేతిక నిపుణులు

అనకాపల్లి: అల్లు ప్రొడక్షన్స్ బ్యానర్‌లో దర్శకుడు కిరణ్ వారియర్, నిర్మాత అల్లు శ్రీరాములు నిర్మించిన 'మెగాస్టార్ ఫ్యాన్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా స్థానిక చోడవరం రహదారి దాడి వీరునాయుడు కళాశాలలో సినిమా బృందం బుధవారం సందడి చేసింది. దీనిలో భాగంగా డైరెక్టర్ కిరణ్ వారియర్ మాట్లాడుతూ మెగాస్టార్ అభిమానులు గర్వించేలా ఈ సినిమా తీసినట్లు తెలిపారు. ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. నిర్మాత అల్లు శ్రీరాములు మాట్లాడుతూ కళాకారులను ఆదరించే గొప్ప సంస్కృతి అనకాపల్లి ప్రాంతవాసులకు ఉందన్నారు. అదే రీతిగా తమ చిత్రాన్ని విజయవంతం చేయాలని, కళాకారులందరినీ ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 29న స్థానిక రాజా థియేటర్‌లో చిత్రం విడుదలవుతుందన్నారు. ప్రత్యేక ఆకర్షణగా జబర్దస్త్ నటుడు గడ్డం నవీన్, హీరోయిన్ సోనీ రెడ్డి, క్రేజీ గణేష్ విచ్చేసి విద్యార్థులతో సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ మాట్లాడుతూ చిన్న సినిమాలను ఆదరించడం ద్వారా ఎంతో మంది కళాకారులను పరిశ్రమలోకి తీసుకురావచ్చు అన్నారు. సినిమా పాటల రచయిత వెల్లూరి నవీన్ అనకాపల్లి ప్రాంతీయుడే కావడం అభినందనీయమన్నారు.

సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేరిన క్లాప్ డ్రైవర్లు



ఏఐటీయూసీలో చేరిన జీవీఎంసీ క్లాప్ డ్రైవర్లు

అనకాపల్లి: స్థానిక జీవీఎంసీ జోనల్ పరిధిలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు (కాంట్రాక్టు కార్మికులు) సీఐటీయూ నుంచి ఏఐటీయూసీలో చేయడంతో డ్రైవర్లకు ఆ పార్టీ జెండా కప్పి బుధవారం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోన లక్ష్మణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ పరిధిలో 30 మంది క్లాప్ డ్రైవర్లు కొత్తగా చేరడం అభినందనీయన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పడాల రమణ మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్లు, లోడర్లకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, కార్మికుల వద్ద నగదు దోచుకుంటున్న కాంట్రాక్టర్‌పై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, స్వేచ్ఛాంధ్ర కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న డ్రైవర్లు, లోడర్లకు కార్మిక చట్టాలు అమలు చేయాలని, కాంట్రాక్టర్ల అక్రమ వేధింపులు, తొలగింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నిమ్మకాయల నరసింహమూర్తి, బంగారు రవి కుమార్, క్లాప్ డ్రైవర్ యూనియన్ నాయకులు కోన దుర్గా, పలివెల సతీష్, శ్యామ్ కుమార్, ఉమామహేష్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పీలావారి గౌరీపరమేశ్వరుల కల్యాణాన్ని ఆలయ గౌవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్ దంపతులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని రఘునాథ్ దంపతులు ప్రారంభించారు. సుమారు 10 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరాహ నూకరాజు, అధ్యక్షుడు బీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ధ బల్లమ్మ నాయుడు, కోశాధికారి బీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మారిశెట్టి జగన్నాథరావు, సహాయ కార్యదర్శి దాడి రామకృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభియాన్ యాప్‌తో ఆయుర్వేద వైద్య సేవలు



కరపత్రిక ఆవిష్కరిస్తున్న డీసీహెచ్ శ్రీనివాసరావు, వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: దేశ్ ప్రకృతి పరీక్షా అభియాన్ (ఆయూష్ విభాగం)లో దేశంలో ప్రతి వ్యక్తి అభియాన్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని ఆయుర్వేద వైద్యసేవలు పొందవచ్చని ఎన్టీఆర్ వైద్యాలయం ఆయూష్ విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక ఆయూష్ కార్యాలయం వద్ద యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాన్ని బుధవారం డీసీహెచ్‌ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ డిసెంబర్ 25 లోపు ప్రతి వ్యక్తి యాప్‌లో నమోదు కావాలని, ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు యాప్ ఎంతగానో సహాయ పడుతుందన్నారు. యాప్‌ను సెల్‌ఫోన్లలో నమోదు చేసుకోలేని వారు ఆస్పత్రికి వచ్చినట్లయితే తమ సిబ్బంది నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రోగులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో బంగారు భవిత



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

కశింకోట: వృత్తి విద్యా కోర్సులు బంగారు భవిష్యత్ కల్పించుకోవడానికి దోహదంగా నిలుస్తాయని కశింకోట బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి అన్నారు. బాలికల హైస్కూల్లో నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా లెర్నెట్ స్కిల్స్ సహకారంతో 9,10 తరగతుల విద్యార్థులకు వస్త్ర తయారీలో వివిధ ప్రక్రియలపై బుధవారం అవగాహన కలిగించారు. టెక్స్‌టైల్స్‌లో హేండ్‌లూమ్స్, సూయింగ్ మిషన్స్, డయింగ్ మిషన్స్ పని తీరు, వాటి ఉపయోగాలను స్కిల్స్ కో–ఆర్డినేటర్ కె.రమేష్ ప్రోత్సాహంతో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు స్టెల్లా, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందాలి



కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, సభ్యులు

మాకవరపాలెం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ రుత్తల లక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. బూరుగుపాలెం పీహెచ్‌సీలో బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, ఎంపీపీ మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. ఈ ఏడాది ఆస్పత్రి అభివృద్ధికి మంజూరైన రూ.40 వేలతో కొనుగోలు చేసిన పరికరాలను ఆమె పరిశీలించారు. కొత్తగా చేపట్టనున్న పనులపై చర్చించి, వాటిని చేసేందుకు నిర్ణయించారు. పీహెచ్‌సీ ఆవరణ లోతట్టుగా ఉండడంతో వర్షపు నీరు నిల్వ ఉండి పిచ్చిమొక్కలు పేరుకుపోవడంతో పాటు విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయని వైద్యాధికారులు చరిష్మ, చరణ్ ఎంపీపీ దృష్టికి తీసుకు వచ్చారు. మండల పరిషత్ నిధులతో ఆవరణ ఎత్తు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూరుగుపాలెం సర్పంచ్ వొబ్బలరెడ్డి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.